సాక్షి
జగిత్యాల
సోమవారం, 8, మే, 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి మొక్కులు చెల్లించారు.



పోలేరమ్మ బోనాలు

కథలాపూర్ : తాండ్ర్యాల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోలేరమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'నీట్'



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నీట్ ప్రశాంతంగా జరిగింది. కేజీఆర్ పబ్లిక్ స్కూల్, జాబితాపూర్ శివారులోని శ్రీచైతన్య పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షకు 902 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 892 మంది హాజరయ్యారు. ఉదయం 11 గంటలలోపే విద్యార్థులను లోనికి అనుమతించారు. పోలీసులు వారిని తనిఖీలు చేశాకే పరీక్ష హాల్‌లోకి పంపించారు. సాయంత్రం 5 గంటలకు పరీక్ష ముగిసింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్‌ఐ అనిల్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రమబద్ధీకరించండి

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని, ఇందుకోసం జీవో జారీఅయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొంరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన ఆత్మీ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తొలుత విధి నిర్వహణలో ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న పంచాయతీ కార్యదర్శులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమ్మె ఏ ఒక్కరి చేతిలో లేదని, ఇది ఓ ప్రజాస్వామ్య ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, రవళి, నవీన్, రామకృష్ణ, మల్లికార్జున్, రాజశేఖర్, స్వర్ణ, షరీఫ్, వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. సర్పంచులకు శాపం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల రూరల్: అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తే.. నిధులు విడుదల చేయలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. పరస్పరం ఆరోపణలు చేసుకోవడం సర్పంచులకు శాపంగా మారుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులు చెల్లించేదారిలేక సర్పంచులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వాలే ఇందుకు బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. నాయకులు గిరినాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, కల్లెపల్లి దుర్గయ్య, సర్పంచులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్‌లో సోమవారం జరిగే ప్రియాంక గాంధీ బహిరంగ సభకు సంబంధించిన ఎన్‌ఆర్‌ఐ పాలసీ డిక్లరేషన్ పోస్టర్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించే ప్రియాంకగాంధీ బహిరంగ సభకు గల్ఫ్ కార్మికులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

భగద్గీతపై ప్రచారం

ధర్మపురి: నక్కలపేట గ్రామంలో ఆదివారం లోక కల్యాణార్థం త్రైత సిద్ధాంత గ్రంథాలు, జ్ఞానధర్మ ప్రచారం చేశారు. జిల్లా త్రైత సిద్ధాంతతకర్త యోగీశ్వరుల ఆదేశాల మేరకు సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. భగవద్గీత గంథాలు కూడా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సాఫీగా ధాన్యం కొనుగోలు చేయాలి

గొల్లపల్లి(పెగడపల్లి): రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పెగడపల్లి మండలం లింగాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధాన్యంలో తేమ, తూకం, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు ఆరుగాలం శ్రమించి, గతేడాదికన్నా అధిక పెట్టుబడి పెట్టి, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే.. ఇక్కడ అనూహ్య పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షాలకు తడిసి మొలకలు వస్తే. తాలు, తప్ప పేరిట మిల్లర్లు క్వింటాలకు ఐదు కిలోలు కోత విధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు రాయితీలు అందించి, హమాలీ చార్జీలు కూడా చెల్లించిందని గుర్తుచేశారు. అకాల వర్షాలకు రైతులు పంటలు నష్టపోతే.. ఆ నష్టాన్ని ప్రభుత్వం భరించి బోనస్ అందించిందన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే మంత్రి స్పందించడం లేదన్నారు.

ఎక్కడ ముద్రించారు?

ఎక్కడి నుంచి పోస్టు చేశారు?

- మావోయిస్టుల లేఖలపై విచారణ
- రంగంలోకి దిగిన పోలీసులు
- తెరపైకి వచ్చిన అటవీభూముల వ్యవహారం
- పట్టాల కోసం రూ.200కోట్లు దండుకోవడంపైనా చర్చ
- పోలీసుల అదుపులో మాజీ మిలిటెంట్?



మావోయిస్టు పార్టీ పేరిట విడుదలైన లేఖ

సారంగాపూర్(జగిత్యాల): మావోయిస్టుల పేరిట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు అందిన హెచ్చరిక లేఖలపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. బీర్‌పూర్ మండలంలోని 15మంది సర్పంచులు సహా పలువురు ఎంపీటీసీ సభ్యులు, ఓ ఎంపీపీ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శికి మావోయిస్టు గోదావరి బెల్ట్ ఏరియా కమిటీ కార్యదర్శి మల్లికార్జున్ పేరిట లేఖలు అందిన విషయం పాఠకులకు విదితమే. వీటిపై బీర్‌పూర్ పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు.

నిఘా తీవ్రతరం..

- హెచ్చరిక లేఖలు ఎక్కడి నుంచి వచ్చాయి? పోస్టు చేసినవారికి మావోయిస్టుల లెటర్‌హెడ్‌లు ఎవరిచ్చారు? వాటిని జిల్లాలోనే ముద్రించారా? లేక గడ్చిరోలి నుంచి తీసుకొచ్చారా? అనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.
- లేఖల్లో కొంత అసత్య సమాచారం ఉన్నా.. గతంలో మావోయిస్టు పార్టీకి సానుభూతిపరులుగా వ్యవహరించిన వారే ప్రజలను భయాందోళనకు గురిచేయడానికి లేఖల వ్యవహారాన్ని ఎంచుకున్నట్లు కూడా భావిస్తున్నారు.
- దీనిపై బీర్‌పూర్ ఎస్సై అజయ్‌ను వివరణ కోరగా లేఖల వ్యవహారంలో అనుమానితులుగా భావిస్తున్న వారిపై నిఘా పెంచామన్నారు.
- కేసు మోదు చేసి ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధులకు రూ.200కోట్ల ముడుపులు

2018–19 సంవత్సరాల్లో వేలాది ఎకరాల అటవీ భూములకు పట్టాలు జారీచేస్తే.. అప్పుడున్నవారిని వదిలేసి.. ఇప్పుడున్న కొందరు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సుమారు రూ.200 కోట్ల వరకు ముడుపులు దండుకున్నారని మావోయిస్టే పార్టీ పేరిట విడుదలైన లేఖల్లో ఆరోపణలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

అటవీ భూములపై మళ్లీ చర్చ

మావోయిస్టుల లేఖలతో అటవీ భూముల వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. బీర్‌పూర్ అటవీ ప్రాంతంలోని దాదాపు 5 వేల ఎకరాల్లో చెట్లు నరికి సేద్యానికి అనుగుణంగా మార్చారు. 2018–19లో రెవెన్యూ అధికారులు వాటికి పట్టాలు జారీచేశారు. రెవెన్యూ భూమిని అనుకుని అటవీ భూములు ఉన్న చోట రెవెన్యూ సర్వే నంబర్ కేటాయించి మరీ పట్టాలు జారీ చేసినట్లు తెలియడంతో అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. అంతే కాదు.. పలు అవినీతి, ఆరోపణలు రావడంతో అప్పటి కలెక్టర్ విచారణ జరిపి సిబ్బందిని సస్పెండ్ చేశారు కూడా. అయితే, అధికారులు పట్టాలు జారీచేసిన భూముల్లో రెవెన్యూ, అటవీ భూముల లెక్కలు తేల్చేందుకు ఉన్నతాధికారుల సూచనతో రెండు శాఖలు సర్వే చేసినా ఆ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. రెండేళ్లుగా ఆ వివాదం మరుగునపడి ఉంది. కానీ, మావోయిస్టుల లేఖలతో అటవీభూముల వివాదం మళ్లీ వెలుగులోకి వచ్చింది.

అవినీతికి పాల్పడలేదు

మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖలను బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల సర్పంచులు తీవ్రంగా ఖండించారు. ఈమేరకు వారు ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాము భూములు కబ్జా చేయడంలేదని, అవినీతికి, ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడడం లేదని స్పష్టం చేశారు. అటవీభూముల విషయంలో తాము ఎలాంటి జోక్యం చేసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం అప్పగించిన పనులు వందశాతం పూర్తిచేశామని తెలిపారు. ప్రజలను ఏనాడూ ఇబ్బందులకు గురిచేయలని వారు వివరించారు.

పోలీసుల అదుపులో 'మాజీ'

జగిత్యాలక్రైం: బీర్‌పూర్ మండలానికి చెందిన 15 మంది సర్పంచులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, కొందరు అధికారులకు మావోయిస్టుల పేరిట లేఖలు పంపించిన వ్యక్తిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన ఎస్పీ భాస్కర్.. మావోయిస్టుల పేరిట ఉన్న లెటర్ ప్యాడ్‌లు, రాసిన విధానం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టారు. బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి మావోయిస్టుల పేరిట లేఖలు రాసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, మావోయిస్టు పార్టీ పేరిట ఉన్న లెటర్‌ప్యాడ్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు ఇచ్చారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారని తెలిసింది. తనకు గుర్తుతెలియని వ్యక్తులు లెటర్ ప్యాడ్‌లు ఇచ్చి వెళ్లారని, పోస్టు చేసింది తానేనని అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

కేజీబీవీల్లో బదిలీలు



కథలాపూర్(వేములవాడ): కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లోని బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు అవకాశం కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్‌టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎం, అకౌంటెంట్, పీఈటీలు తమ ఇష్టం మేరకే బదిలీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఇదీ సమాచారం..

- ఈనెల ఒకటో తేదీ వరకు రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారుఅర్హులు.
- బదిలీ కోసం వెబ్‌సైట్‌లో ఈనెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలి.
- 10, 11వ తేదీల్లో ఎస్‌వోల ద్వారా డీఈవో కార్యాలయానికి దరఖాస్తులు చేరుతాయి.
- 12 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 16న సీనియార్టీ జాబితా ప్రకటన, 17, 18 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- 19న అభ్యంతరాలు పరిశీలించి 20న తుది జాబితా విడుదల చేస్తారు.
- 21, 22లో వెబ్‌ఆప్షన్లు, 25, 26 తేదీల్లో స్థానాల కేటాయింపు, 27 నుంచి 29వ తేదీ వరకు బదిలీల ఉత్తర్వులు జారీప్రక్రియ చేపడతారు.

జిల్లాలో 173 మందికి అవకాశం..

జిల్లాలో 14 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సుమారు 173 మంది అర్హులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బదిలీల్లో తొలుత పనిచేస్తున్న జిల్లాలోని అభ్యర్థులకు పరస్పర బదిలీలకు అవకాశం ఉంటుంది. తర్వాత ఇతర జిల్లాలకు పరస్పర బదిలీలు కోరుకునేవారికి అవకాశం ఇస్తారు. అనంతరం పనిచేస్తున్న జిల్లాలో బదిలీ కోరుకున్నవారికి, చివరగా ఇతర జిల్లాలకు బదిలీ కోరుకున్నవారికి స్థానాలు కేటాయిస్తారని అధికారులు వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేజీబీవీ ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారు అర్హులు. నిబంధనల ప్రకారం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 9వరకు గడువు ఉంది.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

మారుబేరం.. అదనపు ఆదాయం



రాయపట్నంలో ఎండుమిర్చి వ్యాపారం చేస్తున్న రైతులు

- రాయపట్నం రైతుల ఆదర్శం
- జోరుగా ఎండుమిర్చి వ్యాపారం



మిర్చి అన్‌లోడ్ చేస్తున్న హమాలీలు

ధర్మపురి: రైతులు తాము వివిధ పంటలు పండిస్తూనే సీజన్ వారీగా ఎండుమర్చి మారుబేరం(వ్యాపారం) చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయంలో మహిళా రైతులు కూడా భర్తకు చేదోడువాదోడుగా ఉంటూనే కుటుంబంలో తనకంటూ ప్రత్యేక స్థానం తెచ్చుకుంటున్నారు. భార్యాభర్తలు రెండు చేతులా ఆదాయం ఆర్జిస్తూ ఔరా అనిపిస్తున్నారు. వారే రాయపట్నం గ్రామానికి చెందిన రైతులు.

రాయపట్నం.. రైతు గ్రామం..

- ధర్మపురి మండలంలోని రాయపట్నం రైతు గ్రామంగా పేరు పొందింది.
- గ్రామానికి చెందిన అన్నదాతలు కాలానుగుణంగా వివిధ పంటలు పండిస్తున్నారు.
- అంతటితో ఆగడకుండా సాగు విరామ సమయాల్లో ఎండుమిర్చి మారుబేరం చేస్తున్నారు.
- వివిధ జిల్లాల్లో పండించిన ఎండుమిర్చి కొనుగోలు చేసి రాయపట్నం తీసుకు వస్తున్నారు.
- ఏటా మార్చి నుంచి మే నెల వరకు రూ.కోట్లు వెచ్చించి ఈ వ్యాపారం చేస్తున్నారు.
- మహారాష్ట్ర, సిరివంచకోట, అన్నారం, ఏటూరునాగారం, చెన్నూర్ తదితర ప్రాంతాలకు రాయపట్నానికి చెందిన రైతులు ఏటా వెళ్తున్నారు.
- అక్కడి రైతులు పండించే నాణ్యమైన ఎండుమిర్చి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొస్తున్నారు. ఒక్కో రైతు సుమారు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తున్నారు.

వంద మంది వరకు రైతులు..

- రాయపట్నంలో సుమారు వంద మంది వరకు ఎండుమిర్చి మారుబేరం చేసే అన్నదాతలు ఉన్నారు.
- వీరు లారీల ద్వారా ఎండుమిర్చి రాయపట్నం తీసుకొస్తున్నారు.
- ఇలా తీసుకొచ్చిన ఎండుమిర్చిని జిల్లాలోని ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితోపాటు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, జన్నారం తదితర పట్టణాలు, మారుమూల గ్రామాల్లో విక్రయిస్తున్నారు.
- ఇందుకోసం ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఎండుమిర్చి తీసుకెళ్లి రిటెయిల్ ధరలకు విక్రయిస్తున్నారు.
- ప్రస్తుత సీజన్‌లో ఎండుమిర్చి నాణ్యతను బట్టి కిలో ధర రూ.225 నుంచి రూ.280 వరకు ధర పలుకుతోంది.
- ఇలా విక్రయించగా రైతులకు ఆదాయం బాగానే వస్తోంది.
- కానీ, ప్రకృతి వైపరీత్యాలతో ఒక్కోసారి నష్టం కూడా చవిచూస్తున్నారు.

ఐదు లక్షలు పెట్టుబడి పెట్టిన



ఎండుమిర్చి మారుబేరం కోసం రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన. వేరే ప్రాంతాల్లోంచి మిర్చి తెచ్చి మనజిల్లాతోపాటు పక్కజిల్లాలోని పట్టణాలకు వెళ్లి రిటెయిల్‌గా అమ్ముతున్న.

– లచ్చన్న, రైతు

పదేళ్లనుంచి బేరం చేస్తున్న



నేను పదేళ్ల నుంచి ఏటా ఎండుమిర్చి మారుబేరం చేస్తున్న. నాకున్న నాలుగు ఎకరాల్లో వరి, మక్క లాంటి పంటలు పండిస్తూనే మారు బేరం చేస్తున్న. ఆదాయం మంచిగానే ఉన్నా.. ఒక్కోసారి నష్టం కూడా వస్తది.

– తిరుపతి, రైతు

క్లుప్తంగా

వంశీకృష్ణకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వంశీకృష్ణ

గొల్లపల్లి : మండల కేంద్రానికి చెందిన తాడూరి వంశీకృష్ణ శనివారం కోయం బత్తూర్‌లో జరిగిన శతాబ్ది ఉత్సవాల్లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వంశీకృష్ణ సామాజిక అంశాలపై సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థి, యువతకు వ్యక్తిత్వ వికాస శిక్షణ నిర్వహిస్తున్నారు. పదమూడేళ్లుగా వంశీకృష్ణ అందిస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది.

విద్యుదాఘాతంతో నెమలి మృతి



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో ఆదివారం విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందింది. ఆలయ ప్రహరీని ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్లు తగిలి నెమలి మృతిచెందినట్లు ఆలయ కమిటీ సభ్యులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద ఈనెల 5న ఆర్టీసీ బస్సు అద్దాలు పగులగొట్టిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్ రావు తెలిపారు. హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్‌కు వెళ్తుండగా జగిత్యాల మంచినీళ్ల బావి వద్ద ఇద్దరు యువకులు బస్సును అడ్డగించారు. బండరాయి విసరడంతో బస్సు అద్దాలు పగిలి ప్రయాణికుడికి తీవ్రగాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ మామిడి కొండాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడిపై..

మెట్‌పల్లి : పట్టణానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యవహారంలో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... సదరు బాలిక శనివారం ఉదయం కిడ్నాప్‌కు గురైందని ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కిడ్నాప్ చేసిన వంశీ అనే యువకుడిపై పోక్సోకింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భార్యపై దాడి.. కేసు నమోదు

సారంగాపూర్ : మండలంలోని కోనాపూర్ గ్రామంలో భార్యపై భర్త దాడిచేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. భర్త సలీం, భార్య హసీనాబేగం మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన సలీం కర్రతో భార్యపై దాడిచేశాడు. ఈ ఘటనలో హసీనాబేగం తలకు తీవ్రగాయాలయ్యాయి. హసీనాబేగం ఫిర్యాదు మేరకు సలీంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



నారాయణ (ఫైల్)

సిరిసిల్ల అర్బన్ : గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి మండలం.. మర్లపేటకు చెందిన ఆసరి నారాయణ (58) చిరువ్యాపారం చేసుకుంటూ సిరిసిల్ల పట్టణంలోని రెడ్డివాడలో ఉంటున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం భార్య మృతిచెందగా ఇద్దరు కుమారులు మోజేశ్, ప్రవీణ్‌ను చదివిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. నారాయణ మృతితో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీపు, ద్విచక్రవాహనం ఢీ..

సారంగాపూర్ : బీర్‌పూర్ మండలం.. కమ్మునూర్ గ్రామ వంతెన వద్ద ద్విచక్రవాహనాన్ని జీపు ఢీకొంది. ఎస్సై అజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలం కండ్లపల్లికి చెందిన నారపాక కమలాకర్ ద్విచక్రవాహనం, మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన ఇలియాస్, మహ్మద్ జీపు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిందపడిన కమలాకర్ జీపులో ఉన్నవారిపై ఆగ్రహం వ్యక్తంచేశాడు. దీంతో ఇలియాస్ కత్తితో కమలాకర్‌పై దాడికి యత్నించాడు. అప్రమత్తమైన కమలాకర్ అదే కత్తితో ఇలియాస్‌పై దాడిచేయగా ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, విచారణ చేపడుతున్నామని ఎస్సై వివరించారు.

టార్పాలిన్లకు డిమాండ్

- ధాన్యం ఆరబోతకు వినియోగిస్తున్న రైతులు
- రోజుకు అద్దె రూ.15 నుంచి రూ.20 వసూలు
- ఉపాధి పొందుతున్న గుంటూరు జిల్లా వాసులు
- సబ్సిడీపై అందించాలంటున్న రైతులు



పెగడపల్లిలో టార్పాలిన్లు అద్దెకు ఇస్తున్న గుంటూరు వాసులు

పెగడపల్లి(ధర్మపురి): ధాన్యం ఆరబెట్టేందుకు, వర్షం నుంచి కాపాడుకునేందుకు టార్పాలిన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వరి కోతలు మొదలు నుంచి ధాన్యం అమ్మకాలు పూర్తయ్యే వరకు టార్పాలిన్ల అవసరం తప్పనిసరి. ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రోజుకు రూ.15 నుంచి రూ.20 చెల్లించి అద్దె ప్రాతిపదికన తీసుకుంటున్నారు. ధాన్యం అమ్మకాలు పూర్తవ్వగానే వీటిని తిరిగి నిర్వాహకులకు అప్పగిస్తారు.

డిమాండ్‌ను బట్టి సరఫరా..

జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన పలువురు ఇక్కడ యాసంగి, వానకాలంలో టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. మండలాలవారీగా డిమాండ్‌ను బట్టి రోజుకు 400 నుంచి 600 వరకు టార్పాలిన్లను అద్దెకు ఇస్తూ రోజూ రూ.1,000– రూ.1,500 వరకు సంపాదిస్తున్నట్లు తెలిపారు. టార్పాలిన్లు చిరిగిపోతే తామే బాగు చేసుకుంటామని, రైతుల నుంచి ఖాళీ సంచులను తాము రూ.10 చొప్పున తీసుకుని వాటితో టార్పాలిన్లు కుట్టి మళ్లీ అద్దెకు ఇస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. తెలంగాణలో సీజన్ పూర్తి కాగానే కర్ణాటక, ఆంధ్రాకు వెళ్లి అక్కడ టార్పాలిన్లు అద్దెకిస్తూ వ్యాపారం చేసుకుంటామని వివరించారు. ఆ ప్రాంతాల్లో ఒక్కో టార్పాలిన్‌కు రూ.25 చొప్పున అద్దెకు తీసుకుంటారని తెలిపారు.

కానరాని సబ్సిడీ టార్పాలిన్లు

కేంద్రాల్లో రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు వర్షం వస్తే పైన కప్పేందుకు టార్పాలిన్లు ఉపయోగిస్తుంటారు. నాలుగేళ్లుగా సబ్సిడీ టార్పాలిన్లు పంపిణీ చేయకపోవడంతో ప్రైవేటుగా తెచ్చుకుంటున్నారు. కేంద్రాల వద్ద కొనుగోలు ఆలస్యమైతే టార్పాలిన్ల అద్దె భారం పెరిగిపోతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు పంపిణీ చేసి, కేంద్రాల్లో కూడా రైతులకు సరిపడా అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

సబ్సిడీపై అందించాలి



నాలుగేళ్లుగా సబ్సిడీ టార్పాలిన్లను ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. ధాన్యం అమ్మకాల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. ధాన్యం తడవకుండా ఉండేందుకు ఎక్కువ మొత్తం చెల్లించి టార్పాలిన్లు అద్దెకు తెస్తున్నాం. కొనుగోలు ఆలస్యమైతే అద్దె భారం పెరుగుతోంది. సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలి.

– భోగ భూమయ్య, పెగడపల్లి

కిరాయి భారం..



అద్దె పరదాలు తెచ్చుకుంటున్న రైతులకు భారం తడిసి మోపెడవుతోంది. ఒక్కో రైతు సుమారు రూ. వెయ్యి వరకు వీటికి ఖర్చు చేయాల్సి వస్తోంది. గతంలో రోజుకు ఒక్కో టార్పాలిన్‌కు రూ.10 ఉండేది. అద్దె ధరలు పెంచడంతో రూ.15 చెల్లించాల్సి వస్తోంది. సబ్సిడీపై టార్పాలిన్లు అందిస్తే బాగుంటుంది.

– నీరటి రాజేందర్, రాములపల్లి

ఉపాధి దొరుకుతుంది



పెగడపల్లి మండలంలో ఐదేళ్లుగా టార్పాలిన్లు అద్దెకిస్తూ వ్యాపారం చేసుకుంటున్నాం. వానకాలం, యాసంగి పంటల సీజన్‌లో సుమారు 2 నెలలు ఇక్కడే ఉండి వీటిని అద్దెకిస్తున్నా. రైతుల అవసరం మాకు ఉపాధిగా మారింది. రెండు నెలల కాలంలో సుమారు రూ.30 నుంచి రూ.40 వేలకు ఆదాయం వస్తోంది.

– కుంబం గోవింద్, గుంటూర్

పంపిణీ నిలిచిపోయింది



ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే టార్పాలిన్ల సరఫరా నిలిచిపోయింది. అయినా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి టార్పాలిన్లు సబ్సిడీపై రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

– సురేశ్‌కుమార్ జిల్లా వ్యవసాయాధికారి

వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్న కార్లు





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కార్లు

- ఒకరి దుర్మరణం.. నలుగురికి తీవ్ర గాయాలు
- కురిక్యాల శివారులో ఘటన



అజయ్ (ఫైల్)

గంగాధర(చొప్పదండి)/వేములవాడ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై అభిలాష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లికి చెందిన సోమినేని భూమయ్య–భారతి దంపతులకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు అజయ్(40) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య సాయిరక్షిత, ఎనిమిదేళ్ల కూతురు, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం తన కుటుంబసభ్యులతో కలిసి గంగాధరలో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. అనంతరం కరీంనగర్‌కు వెళ్లి వస్తానని, ఇక్కడే ఉండాలని కుటుంబీకులను చెప్పి, కారులో బయలుదేరాడు. అదే సమయంలో వైరాగి అభిషేక్, తన ముగ్గురు కుటుంబసభ్యులతో కలిసి కొమురవెల్లి నుంచి కొండగట్టుకు కారులో వెళ్తున్నాడు. గంగాధర మండలంలోని కురిక్యాల శివారు కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రెండు వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కారులో ఉన్న అభిషేక్, ఇద్దరు మహిళలు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అభిలాష్ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వివరాలు సేకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇల్లంతకుంటలో ఈదురుగాలుల వర్షం..



గాలిపెల్లిలో వరిపైరులో నిలిచిన నీరు



కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో చెలరేగిన మంటలు

ఇల్లంతకుంట : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలిపెల్లి, పొత్తూరు, జవారిపేట, నర్సక్కపేట, రహీంఖాన్‌పేటతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురవగా గాలిపల్లిలో వరిపైరు నేలవాలింది. వరిపొలాల్లో వర్షపు నీరు నిలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లపల్లి గ్రామం మల్లన్నగుడిలోని ధ్వజస్తంభం పాక్షికంగా ధ్వంసమైంది. అనంతారంలోని ఎస్సీ కాలనీలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో మంటలు చెలరేగాయి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 30 మంది తమ పాఠశాలలోనే ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి మిత్రులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషం వ్యక్తం చేశారు. అందరూ కలిసి భోజనం చేసి, రోజంతా సందడి సందడిగా గడిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేల్పుల సరోజన, ఐలయ్య, ప్రధానోపాధ్యాయుడు రాజమల్లయ్య, ఉపాధ్యాయుడు గడ్డం మల్లయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్లను సుందరంగా తీర్చిదిద్దుతాం



సుందరంగా తీర్చిదిద్దిన తెలంగాణ చౌక్



ట్రయల్ రన్ పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్
- తెలంగాణ చౌక్‌లో ట్రయల్ రన్ పరిశీలన

కరీంనగర్: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత కరీంనగనర్‌ను రెండో అతిపెద్ద నగరంగా తీర్చిదిద్దాలన్న ధ్యేయంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ చౌక్‌లో రూ.1.20 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన జంక్షన్ ట్రయల్ రన్‌ను నగర మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూడళ్లలో నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఆధునిక డిజైన్లతో 13 కొత్త ఐలాండ్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో కూడళ్ల నిర్మాణం పూర్తి చేసి, 13 జంక్షన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారని తెలిపారు. నగరంలోని ప్రధాన అంతర్గత రోడ్లతోపాటు కూడళ్లను స్మార్ట్‌గా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. నాకా, ఆర్‌అండ్‌బీ చౌరస్తా వద్ద కూడళ్లను ఆధునీకరిస్తామని చెప్పారు. ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని, సదాశివపల్లి వద్ద కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు బీటీ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, జంగిలి సాగర్, దిండిగాల మహేశ్, గుగ్గిళ్ల శ్రీనివాస్ , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోనేరుకు పూర్వ వైభవం



విద్యుత్ వెలుగుల్లో కోనేరు

కోరుట్లటౌన్ : పట్టణంలోని పురాతన కోనేరుకు పూర్వవైభవం రానుంది. కోనేరును పునరుద్ధరించాలని మున్సిపల్ శాఖ సెక్రటరీ అరవింద్ కుమార్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతం గడి బురుజుల సమీపంలోని పురాతన కోనేరులో మున్సిపల్ ఆధ్వర్యంలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ మకరంద్, కోరుట్ల ఆర్డీవో వినోద్‌కుమార్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సాగర్, మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, తహసీల్దార్ రాజేశ్ సందర్శించి కోనేరును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. ఈ నేపథ్యంలో కోనేరు విశిష్టతను తెలుపుతూ సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ట్విట్టర్ వేదికగా కోనేరుకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. కోనేరు పునరుద్ధరణలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ భాగస్వాములు అయ్యారని తెలిపారు.

యువతి పరారీ.. నిలిచిన వివాహం

జగిత్యాల క్రైం : తెల్లారేసరికి పెళ్లి.. రెండు కుటుంబాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. అంతలోనే యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చివరికి అక్క భర్తతోనే వెళ్లిపోయినట్లు తెలియడంతో వారంతా ఖంగుతిన్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి (20)కి మరో గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపేందుకు నిశ్చయించారు. ఆదివారం ఉదయం వధువు ఇంటి వద్ద వివాహం జరగాల్సి ఉండగా అంతా సిద్ధంచేశారు. వేకువజామున వెళ్లి చూసేసరికి వధువు కనిపించలేదు. చివరికి పొరుగు జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన అక్క భర్తనే వివాహానికి వచ్చి, వధువును తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. దీంతో వివాహం నిలిచిపోవడంతో రెండు కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. చెల్లె వివాహానికి వస్తే తన భర్తే ప్రేమ పేరుతో ఆమెను తీసుకెళ్లడంతో యువతి అక్క ఆందోళనకు గురైంది.

కారును ఢీ కొట్టిన బస్సు

మనోహరాబాద్ (తూప్రాన్): కారును బస్సు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన బ్రహ్మం కారులో తన కూతురు శ్రీజను కొంపల్లిలోని ఓ హాస్టల్‌లో దించి స్నేహితుడు దామోదర్‌తో కలిసి తిరుగు పయనమయ్యాడు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వెళ్తుండగా మనోహరాబాద్ మండలం.. కాళ్లగల్ గ్రామ శివారు జాతీయ రహదారి వద్ద వెనుకనుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్ బస్సు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి గాయాలుకాగా కారు ధ్వంసమైంది. ఈ మేరకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఒకేరోజు ఇద్దరు యువకుల మృతి

- గుండెపోటుతో ఒకరు, విద్యుత్‌షాక్‌తో మరొకరు
- జిల్లెల్లలో విషాదం..



ప్రభాకర్ (ఫైల్)



రాజశేఖర్ రెడ్డి (ఫైల్)

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఒకేరోజు ఇద్దరు యువకులు మృతిచెందడంతో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన మల్లమారి ప్రభాకర్ (34) గ్రామపంచాయతీ కారోబార్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ప్రభాకర్‌కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు జయంత్, అనీష్ ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో మరొకరు..

జిల్లెల్లకు చెందిన అన్నం రాజశేఖర్ రెడ్డి (27) గంభీరావుపేట మండలానికి హార్వెస్టర్ తీసుకెళ్లి డ్రైవర్‌తో వరి కోస్తుండగా విద్యుత్ వైర్లు హార్వెస్టర్‌కు తగిలాయి. ఈ ఘటనలో రాజశేఖర్ రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి భాగ్య, తండ్రి రాజిరెడ్డి ఉన్నారు. ఒకే రోజు ఇద్దరు యువకులు హఠాన్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అ‘పూర్వ’ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు

చందుర్తి (వేములవాడ) : రుద్రంగి మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరుకొని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, లింగారెడ్డి, రవీందర్, పుష్పలత, అనురాధ, శేఖర్, సత్యనారాయణ, విజయలక్ష్మీ, శివప్రసాద్, నరేందర్, అజయ్, రఘుపతిరావు, అంబటి కిషన్, విద్యార్థులు గణేశ్, మల్లేశం, మహేశ్, రాజు, కిషోర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.